ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 23 అక్టోబరు 2025



చేప పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం



- మత్స్య భరోసా పథకం కింద అమలు
- ప్రస్తుత యేడాది 1.68 కోట్ల పిల్లల పంపిణీ
- ప్రతీ చెరువు వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మత్స్య భరోసా పథకం కింద చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు సిద్ధమైంది. జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో మత్స్య భరోసా పథకాన్ని ఇటీవల ప్రారంభించిన ప్రభుత్వం చేప పిల్లలను చెరువుల్లో వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలో వారంలో ఈ పథకాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెలలోనే చేప పిల్లలను వదలాలని భావించినా భారీ వర్షాలు కురవడంతో వర్షాలు తగ్గు ముఖం పట్టగానే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పథకం అమలు మరింత ఆలస్యమైంది. పథకం కింద ప్రతీ చెరువు వద్ద ప్రత్యేకంగా రూపొందించిన సైన్ బోర్డుపై రెవెన్యూ గ్రామం, చెరువు పేరు, చెరువులో వదిలే చేప పిల్లల సంఖ్య, చెరువు ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నదనే వివరాలను పొందుపరుస్తారు.

మత్స్య భరోసా కింద లబ్ధి..

ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం మత్స్య భరోసా పథకాన్ని ప్రవేశపెట్టింది. మత్స్య శాఖ పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమం, రాయితీ ప్రోత్సాహకాలు అన్నీ మత్స్య భరోసా కింద అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రాథమిక మత్స్య సహకార సొసైటీల్లో ఉన్న బెస్త, గంగపుత్రులు, ముదిరాజ్, మత్స్య కార్మికుల కుటుంబాలకు ఈ పథకం కింద లబ్ధి చేకూర్చనున్నారు.

సహకార సంఘాల్లో 18,500 మంది సభ్యులు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 254 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 18,500 మంది సభ్యులున్నారు. ఇందులో 65 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 3,425 మంది మహిళలు, 189 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 14,597 మంది పురుష మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ చెరువులకు 3,174 హెక్టార్ల విస్తీర్ణం, డిపార్ట్‌మెంట్ చెరువులకు 15,162 హెక్టార్ల విస్తీర్ణం ఉంది.

మత్స్యకారులకు జీవనోపాధి

జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు కలిపి 765 వరకు ఉన్నాయి. కుంటలు, చిన్న చిన్న చెరువుల్లో 35-40 మిల్లీ మీటర్ల చేప పిల్లలు 54 లక్షలు వదిలేందుకు రంగం సిద్ధం చేశారు. మరో 1.14 కోట్లు 80-100 మిల్లీమీటర్ల చేప పిల్లలు సరఫరా చేయడానికి నిర్ణయించారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో 1.68 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదలడం వల్ల 147 మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని 11,039 మంది సభ్యులకు జీవనోపాధి లభించనుంది. ఇందులో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు సైతం ఉన్నాయి.

నాలుగు రకాల చేప పిల్లలు..

జిల్లాలోని పలు చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నాలుగు రకాల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో బంగారు తీగ, కట్ల, మృగాల, రోహు, సాధారణ రకం చేప పిల్లలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటితో పాటు రొయ్య పిల్లలను వదలాలని (మిగతా 8వ పేజీలో)

పశువులకు గాలి కుంటు టీకాలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో పశుసంవర్ధక అధికారుల ఆధ్వర్యంలో పశువులకు బుధవారం ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెటర్నరీ సహాయ సంచాలకులు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందదన్నారు. టీకాలు ఇప్పించడం వల్ల పశువులను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వాసుపావని, పొలాసలైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు విశాల్, నరేష్, పంచాయితీ కార్యదర్శి సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారిణి శ్రీప్రియ కోరారు. బుధవారం మండలంలోని పాశిగామలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాశిగామలో 75 ఆవులు, ఎడ్లు, 72 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు.

భూ భారతిపై అవగాహన కలిగి ఉండాలి




మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్, హాజరైన అధికారులు, జీపీవోలు

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై జీపీవోలకు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జీపీవోలకు భూ భారతి చట్టంపై శిక్షణ మరియు అవగాహన విధి నిర్వహణ బాధ్యతల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ క్లస్టర్‌కు ఒక గ్రామ పాలనాధికారి (జీపీవో) ఉంటారని తెలిపారు. గ్రామ పాలనాధికారులు రికార్డుల నిర్వహణ, భూమి హక్కుల రికార్డు (ఆర్ఓఆర్), వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మరియు మ్యూటేషన్, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ రకాల రెవెన్యూ సర్వీసుల గురించి నూతన జీపీవోలకు శిక్షణ మరియు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. భూ భారతి చట్టంలోని ముఖ్యమైన సెక్షన్ల గురించి జీపీవోలకు వివరించారు. అదేవిధంగా జీపీవోలు గ్రామ పటం, ప్రాథమిక సమాచారం, నీరు, ఇసుక, ఇతర మైనింగ్ కార్యకలాపాలపై నియంత్రణతో పాటు, కులం, నివాసం, ఆదాయం, లోకల్ ఏరియా, ఇతర ధృవీకరణ పత్రాల మంజూరు కొరకు విచారణ నివేదిక లో క్రియాశీలంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విలేజ్ మ్యాప్ ఖచ్చితంగా విధి నిర్వహణలో వెంట ఉండాలని, సెత్వార్, ఖాస్రా వంటి రికార్డులపై ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అసాధారణ సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉండాలన్నారు.

ప్రాథమిక సమాచారం మండల తహసీల్దార్, ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు. శిఖం భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణ జరగకుండా నెలలో కనీసం రెండుసార్లు సందర్శించాలని తెలిపారు. గ్రామాల్లోని ఇసుక, మట్టి అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత జీపీవోలదేనని తెలిపారు. జిల్లాలోని టిప్పర్‌లతో మట్టి, ఇసుక రవాణాకు అనుమతులు లేవన్నారు. స్థానిక తహసీల్దార్ అనుమతులతో నిర్ణీత సమయంలో మాత్రమే ట్రాక్టర్‌లలో ఇసుక, మట్టి రవాణా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో హకీమ్, సంబంధిత అధికారులు, జీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలి

మల్లాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో 24 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని ఆర్‌యుపీపీటీ రాష్ట్ర శాఖ సహాధ్యక్షుడు వేల్పుల స్వామియాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 యాక్ట్ రద్దు చేసి భాషోపాధ్యాయులకు నియామకం తేది నుండి నోషనల్ సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని, పెండింగ్ డీఏ, బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు నరేందర్, రాజేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లిఖార్జున్, రాజశేఖర్, నర్సయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న మండల కేంద్రంలోని గుంటి పెరమాళ్ళ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వం కల్పించే మద్దతు ధరకు రైతులు తమ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని కోరారు. మధ్య దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు.

ఈజీఎస్ గ్రామ సభలు

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం, బూరుగుపల్లె, తీగలధర్మారం, నాగారం గ్రామాల్లో ఈజీఎస్ గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఈజీఎస్ కింద 2026-2027 ఆర్థిక సంవత్సరానికిగాను చేపట్టనున్న పనుల గుర్తింపు కోసం ఈ సభలు నిర్వహించారు. పశువుల, మేకల, గొర్రెల, కోళ్లషెడ్లు నాడెపు, వర్మి ఎరువుల గుంతలు, పండ్ల తోటల పెంపకం, పొలం తోట పనులు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ పనులను గుర్తించారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, ఈజీఎస్ ఏపీవో సుజన్, టీఏలు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక బీట్‌బజారులో గల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం మక్కలను కొనుగోలు చేస్తుందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం భూమిపూజకు సీఎం రేవంత్‌రెడ్డి జగిత్యాలకు వస్తానని హామీ ఇచ్చారన్నారు. మక్కలకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలపై భారం తగ్గే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసేలా ఎంపీ అర్వింద్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

సన్నాలకు బోనస్

సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం అందించడం రైతాంగానికి ఒక వరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో గల వ్యవసాయ మార్కెట్(జగిత్యాల)లో జగిత్యాల ప్యాక్స్ సెంటర్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సంజయ్ చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొడ్డు వడ్ల విషయంలో ఎఫ్‌సీఐ ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ప్యాక్స్ చైర్మెన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సీఈవో వేణు,ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కుల భూమయ్య, ఆర్టీఏ మాజీ సభ్యులు సుధాకర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మెన్‌లు కొలుగూరి దామోదర్‌రావు, నక్కల రాధ రవీందర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ప్రకాష్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులను దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ మనోహర్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్ రావు, పడిగెల రవీందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'యావర్ రోడ్డును తక్షణమే విస్తరించాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాభివృద్ధి సేవా సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర దశాబ్దాలుగా ఎన్నికల హామీగా మిగిలిపోయిన యావర్ రోడ్డును వెంటనే విస్తరించాలని జగిత్యాల పట్టణ ప్రజాభివృద్ధి సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం 50 మందిని చంపిన యావర్ రోడ్డు కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు సూరజ్ శివ శంకర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో అత్యంత ప్రమాదకరమైన రహదారిగా యావర్ రోడ్డు పేరుగాంచిందని అన్నారు. 45 సంవత్సరాలుగా పాలకులు యావర్ రోడ్డు విస్తరణకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఎన్నికల సమయంలో యావర్ రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు ఇరుకుగా ఉండగా ఆ ఇరుకు రోడ్డుపై నే పలు వురు వ్యాపారాలు నిర్వహించు కోవడంతో మరింత ఇరుకుగా మారి ప్రయాణం కష్టంగా మారిందన్నారు. దుకాణాల ముందు పార్కింగ్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినప్పటికీ వ్యాపారులు నాయకుల అండతో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను గమనించి పాలకులు యావర్ విస్తరణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సాంబారి కళావతి, మిసాక్ అహ్మద్, ముకు రాజలింగం, కంటి అంజయ్య, బండారి మల్లి కార్జున్, జవ్వాజి లచ్చన్న, పిల్లి బాల కృష్ణ, డిండిగాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

-డీఆర్డీఏ పీడీ రఘువరణ్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. మై భారత్(మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను పీడీ రఘువరణ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృడత్వంతో పాటు, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పోషకులు కూడా తమ పిల్లలను క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. బుధవారం నిర్వహించిన పోటీల్లో కబడ్డీ విభాగంలో బీర్‌పూర్, నక్కలపేట జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయని, అలాగే వాలీబాల్ సెమీస్, ఫైనల్స్ ఇతర అథ్లెటిక్ ఈవెంట్స్‌ను గురువారం యథావిధిగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడాపోటీలకు 20 వాలీబాల్ జట్లు, 14 కబడ్డీ జట్లు, మహిళా విభాగంలో 8 కబడ్డీ జట్లు, వాలీబాల్‌లో 6 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో రవికుమార్, డీవైవో రాంబాబు, ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు, మైభారత్ జగిత్యాల యువజన వాలంటరీ బాధ్యులు మారం గణేష్, రవితేజ, చందు, హరీష్, సాయి, ఆదిత్య, లహరి, శ్యామల, లతతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అంజయ్య

కోరుట్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని కల్లూర్, సర్పరాజుపూర్ గ్రామలకు బస్సు సౌకర్యం కల్పించాలని కల్లూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వనతడుపు అంజయ్య కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కోరుట్ల మండలంలోని కల్లూర్ గ్రామంతో పాటు సర్పరాజుపూర్ గ్రామాలను నుండి కోరుట్ల, రాయికల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. రెండు గ్రామాల మహిళలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కోరుట్ల పట్టణానికి రావడానికి ఆటోలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఈ జవహర్‌నాయక్, రాంజీ నాయక్ అన్నారు. జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ వారోత్సవాల సందర్భంగా విద్యుత్ పట్టణ బాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇనుపవైర్లపై బట్టలు గానీ, ఇతరత్రా ఆరబెట్టుకోకూడదన్నారు. అలా చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే విద్యుత్ అధికారులకు, స్థానిక లైన్‌మెన్‌కు తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ అధికారులు 24/7 అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ జవహర్‌నాయక్, రాంజీ నాయక్, ఏఈ సతీష్, అనూష, ప్రకాష్, ఉదయ్, శ్రీనివాస్, ప్రసాద్ మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, అర్బన్ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ యండి సెమియొద్దీన్‌తో పాటు పలువురు విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు
- గోదావరికి ఘనంగా హారతి 7

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 24. 5 గ్రాముల బంగారం, రూ. 19 వేల నగదు స్వాధీనం 6

గంజాయి సాగు చేస్తున్న ముగ్గురి అరెస్టు

కోరుట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని బర్ల కొట్టం సమీపంలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి సాగు చేస్తున్న గంజాయితో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టణంలోని హాజీపురకాలనీలోని బర్ల కొట్టం సమీపంలోని చెట్ల పొదల్లో గంజాయి సాగు చేస్తున్న విషయం తెలుసుకున్న కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి తనిఖీలు నిర్వహించారు. సాగు చేస్తున్న గంజాయిని వ్యవసాయ అధికారి నాగమణి సమక్షంలో పరిశీలన జరిపి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్ తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చిగురుమామిడి,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట గ్రామంలో బుధవారం వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు బావుల వద్ద పేకాట ఆడుతన్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ. 1700 నగదు దొరికినట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, గంజాయి విక్రయించినట్లు ఉన్నా సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయని అన్నారు.

వెల్గటూర్ : మండలంలోని చెగ్యాం గ్రామ శివారులో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం చెగ్యాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ పోలీసులు, వెల్గటూర్ పోలీసుల ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద లభించిన రూ.58 వేలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రంగసాగర్ వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం

బీర్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామ శివారులోని గోదావరి నదిలో ఐళ్ల మడుగు వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని గుర్తించిన గ్రామ కార్యదర్శి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ జిల్లా చేపూర్ గ్రామానికి చెందిన కనికారపు సుజాత సంఘటన స్థలానికి చేరుకుని ఇతను తన భర్త కనికారపు గంగాధర్ అని తెలిపారు. గంగాధర్ బావ మరిది గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోగా మృతుని శవాన్ని వెతికేందుకు గంగాధర్ గోదావరి నదిలోకి వెల్లగా వరద ప్రవాహం ఎక్కువై ఆ ప్రవాహంలో తన భర్త కొట్టుకు పోయాడని పేర్కోంది. పోలీసులు మృతదేహనికి పంచనామా నిర్వహించి భార్యకు అప్పగించారు. మృతుడి భార్య తెలిపిన వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా



పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

50 చలాన్ల పైబడినవి 301 వాహనాలు

వాటిపై రూ.64.39 లక్షల జరిమానా

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనల అమలును మరింత కఠినతరం చేయాలని సీపీ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. పెండింగ్ చలాన్ల వసూలులో భాగంగా స్పెషల్ డ్రైవ్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. ఇప్పటి కే కమిషనరేట్ వ్యా ప్తంగా 50 చలాన్ల పైఉన్న 301 వాహనాలను గుర్తించారు. ఈ వాహనాలపై రూ.64 లక్ష ల 39 వేల 715 జరిమానా పెండింగ్‌లో ఉంది. కమిషనరేట్ వ్యాప్తం గా అక్టోబరు 17వ తేదీ నాటికి మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలకు 50 సార్లు, ఆపై పాల్పడి జరిమానా చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులను పట్టుకొని చలాన్, జరిమానా వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 100 ఆపై వరకు పెండింగ్ చలాన్లు ఉండి జరిమానా చెల్లించని వాహనాలు 60 వరకు ఉన్నాయి. వాటిపై ఉన్న జరి మానా మొత్తం 21 లక్షల 83 వేల 875 రూపాయ లుగా గుర్తించారు. 50 నుంచి 100 వరకు పెండింగ్ చలాన్లు కలిగిన 241 వాహనాలను గుర్తించారు. వాటి జరిమానా మొత్తం 42 లక్షల 55 వేల 840 రూపాయలు.



స్పెషల్ డ్రైవ్

పెండింగ్ చలాన్లు వసూలు చేసేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తక్షణమే రంగంలోకి దిగాలని సీపీ ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు, వాహనదారులు లేకుండా చూడాలని, ఈ విషయంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. దీంతో కొద్ది రోజులుగా కమిషనరేట్ వ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

వాహనాలను స్వాధీనం చేసుకుంటాం

గౌస్ ఆలం, పోలీస్ కమిషనర్



పెండింగ్ చలాన్లు కలిగిన వాహన దారులు తక్షణమే చెల్లించాలి. లేనట్లయి తే తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. కమిషనరేట్ లో పెండింగ్ చలాన్లు కలిగిన వాహనాలు లేకుండా చూడాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.

ద్విచక్రవాహనం అదుపు తప్పి అంగన్‌వాడీ ఆయా మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా దొబ్బల మరియ(58) దుర్మరణం చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని సమీప బంధువు మృతి చెందడంతో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని అంగన్‌వాడీ ఆయా మరియ తన చిన్నకొడుకు ప్రభాకర్‌తో కలిసి బైక్‌పై వస్తోంది. అక్కపల్లి గ్రామ శివారులో బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాల పాలైన మరియను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు మహేశ్, ప్రభాకర్‌లు ఉన్నారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.



మరియ(ఫైల్)

నేరెళ్ల వద్ద బైక్ పైనుంచి పడి మృతి

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వేముల పుష్ప (50) అనే మహిళ బుధవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామానికి చెందిన పుష్ప మరో మహిళ కాసారపు గౌరమ్మ పత్తి ఏరి కాసారపు సంతోష్‌కు చెందిన టీఎస్ 02 ఈబీ 5912 అనే నెంబర్ బైక్ పైన ఇంటికి బయలు దేరారు. సరిగా రోడ్డు పైకి వచ్చే సరికి బర్రెలు అడ్డురావడం వల్ల బైక్ పైనుంచి కింద పడి పుష్ప మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. మృతదేహన్ని పోలీసులు జగిత్యాల మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు బుధవారం వన్‌టౌన్‌లో సీఐ రాంచందర్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీటర్ల సత్ప్రవర్తనతో ఉండాలని, నేరఘటనల్లో పాల్గొనవద్దని సూచించారు. కొంతకాలంపాటు సత్ప్రవర్తనతతో మెదిలిన వారి రికార్డులను పరిశీలించిన తరువాత షీట్‌ల ఎత్తివేతకు సిఫారసు చేసే అవకాశముందన్నారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై పోలీసు నిఘా నిత్యం ఉంటుందని హెచ్చరించారు. నేరఘటనల్లో జోక్యం చేసుకుంటే వ్యక్తిగతంగానూ, సమాజ పరంగానూ మరిన్ని సమస్యలు ఎదురవుతాయన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్సై భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

జగిత్యాలరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాతో పాటు నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈనెల 13న జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామంలో నాలుగు ఇళ్లలో తెల్లవారుజామున తాళాలు పగులకొట్టి బంగారు, వెండి, నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు దొంగల కోసం గాలింపు చేపట్టి మహారాష్ట్రకు చెందిన మ్యాకల్‌వర్ సాయినాథ్, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన ముండె శ్రీకాంత్, మైనర్ బాలుడిని బుధవారం ధరూర్ బైపాస్ రోడ్డులో కారులో వెళ్తుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ రఘచందర్ తెలిపారు. కొంతకాలంగా ఈ ముఠా జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరి నుంచి 24.5 గ్రాముల బంగారం 19 వేల నగదు, ఓ కారు, సెల్‌పోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాకు చెందిన మహారాష్ట్రలోని హింగోళి జిల్లాకు చెందిన మార్కులే అనిల్‌తో పాటుగా మరికొంతమంది పరారీలో ఉన్నారని, వీరిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.



దొంగల ముఠా అరెస్ట్ చూపుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగల వంతెన వద్ద కారు ఢీకొని 'ఆంధ్రజ్యోతి' ఉద్యోగి కాల్వ శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం తీగల వంతెన సమీపంలోని ఐలాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు శంకర్‌ను ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని కారు నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ పైనుంచి దూకి ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి బాబు(30) అనే వ్యక్తి బుధవారం రాత్రి సెల్‌టవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబు మామిడిపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. కొన్ని రోజుల క్రితం గల్ఫ్‌దేశం వెళ్లి ఈ మధ్యనే ఇంటికి వచ్చాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



బాబు(ఫైల్)

ఇరాక్‌లో పెగడపల్లి వాసి మృతి

పెగడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది గంటల్లో విమానం ఎక్కి ఇరాక్ నుంచి స్వస్థలానికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుతో పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి (నిమ్మని) రమేష్ (55) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. బతుకుదెరువు కోసం రమేష్ ఏడాది క్రితం ఇరాక్ వెళ్లాడు. అక్కడ విధులు నిర్వహిస్తూ బుధవారం స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. మంగళవారం రాత్రి గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించేలోపే రమేష్ మృతిచెందినట్లు స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు, కూతురు ఉన్నారు. రమేష్ మృతదేహన్ని స్వస్థలానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రమేష్ (ఫైల్)

రాజీవ్‌రహదారి పక్కన గుర్తు తెలియని బైక్

- కొన్ని రోజులుగా ఒకే చోట ఉన్నట్లు గర్తింపు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో డైట్ కళాశాలకు ఎదురుగా రాజీవ్ రహదారి పక్కన ఓ ద్విచక్ర వాహనం కొన్ని రోజులుగా ఒకే చోట ఉంది. అయితే అ బైక్ ఎవరిది, ఇందుకు ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలేని వెళ్లారనే సందేహం వ్యక్తం అవుతోంది. బైక్ ముందు వైపు ఏపీ 37 ఏఫై 2219 నెంబర్ ప్లేట్ ఉండగా, వెనుక వైపు నంబర్ లేదు. అయితే ఈ వాహనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010లో రిజిస్ట్రేషన్ అయినట్లు తెలుస్తున్నది. ఏపికి చెందిన ఈ వాహనం ఇలా రాజీవ్ రహదారి పక్కన వదిలి వెల్లడంపై అనుమలకు దారి తీస్తోంది. వాహనం పాడై ఇక్కడే వదిలేసి వెళ్లారా, లేదా ఎవరైనా బైక్‌ను దొంగిలించి ఇక్కడ వదిలి వెళ్లారా అనే , లేదా ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. ఎప్పుడు, ఎవరు, ఎందుకు ఈ బైక్‌ను రాజీవ్ రహదారిపై వదిలి వెళ్లారు, బైక్ వదిలి వెళ్లిన వారు ఎవరై ఉంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై పూర్తి స్థాయిలో దార్యాప్త చేస్తే విషయం బయటికి వచ్చే అవకాశం ఉన్నది.



రాజీవ్‌రహదారి పక్కన నిలిపిన బైక్

పొలాస ఏపీటీ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర సందర్శనలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ స్వాతి సూచనల మేరకు పొలాస అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. టీచింగ్ అసోసియేట్ అశ్ఫక్ నేతృత్వంలో పార్టిసిపేటరీ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌లో వివిధ విభాగాల పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు.



వ్యవసాయ మార్కెట్‌లో విద్యార్థులు

కొనుగోళ్లు, అమ్మకాల ప్రక్రియ, ఆడ్తిదారులు, కమిషన్ విధానం, ఈ నామ్ విధానం, ఏ ధాన్యాలు, కొనుగోళ్లు, ఎంత ధరకు కొనుగోలు చేస్తారనే తదితర అంశాలపై విద్యార్థులు మార్కెట్ అధికారులను, ఆడ్తిదారులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. టీచింగ్ అసోసియేట్ పూజితతో పాటు ఆడ్తిదారు నలువాల తిరుపతి, ఏపీటీ కళాశాల విద్యార్థులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన వంగ రాయమల్లు అనే వ్యక్తి అతని మనుమరాలుతో సహా మోటారు సైకిల్‌పై వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా చెంజర్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చందుర్తి వద్ద ఒకరికి..

చందుర్తి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ-చందుర్తి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన మోతె రాములు బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. రాములకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందిచారు. చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది వెంకటరెడ్డి, చాణక్య తెలిపారు.

ఇసుక టాక్టర్ల పట్టివేత

వీణవంక, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు టాక్టర్లను పోలీసులు పటుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొర్కల్ గ్రామానికి చెందిన కొందరు టాక్టరు యజమానులు ప్రభుత్వం నుంచి ఎలాంటీ అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తుండగా పట్టుకోని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పాఠశాలలోకి పాము

ఎలిగేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాము చొరబడింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఏడాది క్రితం పాఠశాలను ఆనుకొని వన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుండటంతో తరుచుగా పాములు, విషపురుగులు తరగతి గదుల్లోకి వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పాములు మూడుసార్లు తరగతి గదుల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నర్సరీని పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం వేణుకుమార్‌ను వివరణ కోరగా నర్సరీ మూలంగా విషప్రాలు తరుచుగా వస్తున్నాయని పిల్లలు జంకుతున్నారని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటలో బుధవారం తెల్లవారుజామున ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. ఆలయాల తాళాలు పగులగొట్టి హుండీని ధ్వంసం చేశారు. అమ్మవారలపై ఉన్న పుస్తెలు, ముక్కు పుడక, మట్టెలు, మంగళసూత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్త చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కల్తీ సిరప్‌పై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ సిరప్‌లు ఇచ్చి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పెద్దపల్లి పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన చిరంజీవి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీవాణికి ఫిర్యాదు చేశారు. రెండురోజులు క్రితం చిరంజీవి తన కుమారుడు అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ఒక పిల్లల డాక్టర్ వద్దకు చికిత్స కోసం తీసుకువెళ్లానని తెలిపారు. అక్కడ డాక్టర్ పరీక్షించి సిరప్‌తో పాటు టాబ్లెట్లు రాశారని పేర్కొన్నారు. ఆసుపత్రి పక్కనే గల మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేశానని తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత సిరప్ మూతతీసిన తర్వాత అందులో ఏవేవో తేలియాడుతూ కనబడ్డాయని, ఆ సిరప్ పిల్లలకు తాగిస్తే ప్రాణం పోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిరప్‌ను తీసుకునివెళ్లి మెడికల్‌షాపు యజమానిని ప్రశ్నిస్తే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వోతో పాటు డ్రగ్‌ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశానని చిరంజీవి పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పట్టణంలోని రాథోడ్ నాందేవ్ అనే ఉపాధ్యాయుడు తాను అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి శనివారం స్వంత గ్రామానికి వెళ్లాడు. గ్రామం నుంచి వచ్చిన ఆయన బుధవారం వచ్చి ఇంటి తాళం తెరచి ఇంటి లోపలికి వెళ్లి చూసే సరికి బీరువా తెరచి, సామాన్లు చిందర వందర చేసినట్లు గుర్తించారు. అలాగే బీరువాలో దాచి ఉంచిన రూ. 15,000 నగదు, అరతులం బంగారం వచ్చిన వ్యక్తులు అపహరించారు. అదే విధంగా జర్మనీలో ఉంటున్న కొరిడె సత్యన్న ఇంటి తాళాలు కోసి చోరీకి విఫలయత్నం చేసినట్లు తెలుస్తుంది. సత్యన్న ఇంటిలో తులంనర బంగారం, వెండి పంచపాల చోరీ జరిగినట్లు తెలుస్తుంది, జర్మనీ నుంచి సత్యన్న వస్తే ఇంటిలో ఇంకా ఏమి దొంగిలించారో అనేది తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

- **చెట్ల పొదల్లో ఆలయ హుండీ**

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ స్టేజీ నుంచి కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెట్ల పొదల్లో ఆలయానికి సంబంధించిన హుండీ పడేసి ఉన్నది. ఇదే గ్రామానికి చెందిన శ్యామకూర సంపత్‌రెడ్డి చెట్ల పొదల్లో ఉన్న హుండీని గమనించారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్సై సాయికృష్ణకు సమాచారం అందించినాడు. అక్కడికి చేరుకున్న ఎస్సై హుండీ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు హుండీ చోరీ జరిగినట్లు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు. ప్రస్తుతం హుండీని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.



ధర్మపురిలో తెరిచి ఉన్న బీరువా



చెట్ల పొదల్లో పడేసిన హుండీ

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

ముత్తారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాస్ తారక దంప తుల కూతురు అభిజ్ఞ(18నెలలు) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ మేరకు చిన్నారికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కాగా ఆ పాప ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మళ్లీ అదే ఆసుపత్రికి బుధవారం చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. దీంతో వైద్యులు ఇంజెక్షన్ వేసి, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. కాగా ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి చిన్నారికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యు లు చిన్నారి మృతిచెందినట్లు తెలిపారు. దీంతో అభిజ్ఞ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతిచెందినట్లు ఆరోపించారు. తమ కుమార్తె ప్రాణాలు తీసిన సదరు ఆసుపత్రి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ ఘటనతో లక్కారం గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

రేపు యాదవులకు రాజకీయ శిక్షణ తరగతులు

తిమ్మాపూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఉమ్మడి జిల్లాలోని యాదవ కులస్తులకు అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సొగని కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శుక్రవారం రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని రామకృష్ణ కాలనీలో యాదవ సంఘం భవనంలో సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. మానకొండూర్ మండలం ఖాదర్‌గుడెంలోని ఫామ్ అరవింద ఫామ్‌లో రాజకీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఆవుల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్మంలో సందవేణి ప్రసాద్, బాబుర్ కుమార్, జంగా శ్రీనివాస్, నరసయ్య, పోలం అంజయ్య, ఆవుల అంజయ్య, హనుమంతు, వేల్పుల ఓదెలు, భూపతి, గోపాల్, పోలం మల్లేష్, రాజయ్య, రమేష్, సంపత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యాదవుల సంఘం నాయకులు

ఘనంగా సామూహిక కార్తీక దీపోత్సవం



భీమేశ్వర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. రాజన్న దేవాలయ సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమం ప్రతీ రోజు రాత్రి నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాశ్వత ఆకాశ దీపం ప్రారంభించిన అర్చకులు..

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస దీపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నెలరోజుల పాటు వెలిగే శాశ్వత ఆకాశ దీపాన్ని ఆలయ అర్చకులు ప్రతిష్ఠించారు.

గోదావరికి ఘనంగా హారతి



గోదావరి నది వద్ద గంగాహారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. గోదావరి నది వద్ద హారతి కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, భక్తులు హారతి ఇచ్చి నదిలో దీపాలు వదిలి పెట్టారు. రామలింగేశ్వర, అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి వారలకు, అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు..

- రూ. 2.90 కోట్లతో నిర్మించినా..
- రోడ్లపక్కనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు
- రెండో బైపాస్ రోడ్డులో పొంచివున్న ప్రమాదం



నిరుపయోగంగా ఉన్న నూతన కూరగాయల మార్కెట్



రెండో బైపాస్‌లో నిర్మిస్తున్న షెడ్లు

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. వేములవాడ పట్టణంలో రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుగా అప్పటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్ ఎదురుగా గర్ల్స్ హైస్కూల్ పక్కన పదివేల అడుగుల విస్తీర్ణంలో సుమారుగా రూ.2.90 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. నూతన భవనంలోకి వ్యాపారులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. మార్కెట్ భవన నిర్మాణం రెండు సంవత్సరాల క్రితం పూర్తయినప్పటికీ ప్రారంభంలో ఆలస్యం జరిగింది. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అప్పటి మంత్రి చేతుల మీదుగా కూరగాయల మార్కెట్ భవనాన్ని ప్రారంభించారు.

అయితే ఇప్పటివరకు రైతులు, వ్యాపారులకు స్టాల్స్ కేటాయించలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు స్టాల్స్ కేటాయించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానించినా వ్యాపారులు చొరవ చూపకపోవడంతో పది మంది మాత్రమే ముందుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులు, రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో బైపాస్‌లోని రోడ్డు పక్కన రైతులు తాత్కాలిక షెడ్లు వేసుకుని కొంత మంది, మరికొంత మంది రోడ్డుపక్కన, రోడ్డుపైన కూరగాయల విక్రయిస్తున్నారు. రెండో బైపాస్ రోడ్డులో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతాయి. దీంతో భారీ వాహనాలు వెళ్లే క్రమంలో రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటంతో భవనం దెబ్బతినే పరిస్థితి ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సమయంలో తరలింపు..

ఉప్పుగడ్డ వీధిలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను కరోనా సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అక్కడినుంచి తరలించారు. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండులోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోకి తరలించారు. మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో కూరగాయల వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో రెండవ బైపాస్ రోడ్డులోని మూలవాగు ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేయగా మరికొందరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణంలోని కోరుట్ల బస్టాండు సర్వాయిపన్న విగ్రహం వద్ద తెల్లవారు జామున ఉదయం 4 గంటల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి రోడ్డుపైన విక్రయించడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

68 షెడ్ల నిర్మాణం..

వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కూరగాయల మార్కెట్‌లోకి రైతులు, వ్యాపారులు వెళ్లేందుకు మొగ్గు చూపలేదు. గత ప్రభుత్వం తమ అభిప్రాయం తెలుసుకోకుండా కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టిందని, భవనం కూరగాయలు విక్రయించేందుకు అనువుగా లేదని రైతులు, వ్యాపారులు అందులోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో రైతుల, వ్యాపారుల నిర్ణయం మేరకు రెండో బైపాస్‌రోడ్డులో మూలవాగు పార్కును ఆనుకుని కూరగాయల విక్రయానికి షెడ్ల నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో రూ.86 లక్షలతో 68షెడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తికాగా, మిగిలిన పనులను నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు.



రోడ్డుపై కొనసాగుతున్న మార్కెట్(ఫైల్)

కాకతీయ కాలువకు నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల బుధవారం కొనసాగింది. డ్యామ్ నుంచి కాకతీయ కాలువ కు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు వదిలారు.

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల వాసులు



జీఆర్ దేశాయి



పీసీ హన్మంత్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ గౌరిశెట్టి రామూర్తి దేశాయి, పి. హన్మంత్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి ఈ ఎన్నికల్లో జీఆర్ దేశాయి రాష్ట్ర కార్యదర్శిగా, పి.హన్మంత్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయినట్లు హరి అశోక్ కుమార్ తెలిపారు. వీరికి గురువారం జగిత్యాలలో పౌర సన్మానం జరపనున్నట్లు ఆయన తెలిపారు.

అర్బన్ బ్యాంకులో ఎన్నికల కోలాహలం





అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

- రెండో రోజు 35 నామినేషన్లు
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ
- రేపు పరిశీలన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకులో బుధవారం ఎన్నికల కోలాహలం కనిపించింది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజు బుధవారం 34 మంది అభ్యర్థులు 35 నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్‌కు అందించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డైరెక్టర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి మద్దతుదారులతో నామినేషన్లు ఎన్నికల అధికారికి సమర్పించారు. మాజీ చైర్మన్లు గడ్డం విలాస్‌రెడ్డి తన ప్యానల్‌లోని డైరెక్టర్ పదవులకు పోటీచేస్తున్న అభ్యర్థులతో కలిసి నామినేషన్లు వేయగా, కర్ర రాజశేఖర్ ఆయన మద్దతుదారులు, ఆయన ప్యానల్‌లోని డైరెక్టర్లతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను అందించారు. స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

మంగళవారం మొదటిరోజు ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా బుధవారం రెండో రోజు 34 మంది 35 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. మహిళా కేటగిరీలో ముద్దసాని శ్వేత, కంజర్ల రేణుక, మూల లక్ష్మి, ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలకు లింగంపల్లి సత్యనారాయణ, అలుగు విద్యాసాగర్, సరిళ్ల రత్నకుమారి, బత్తుల రాజ్‌కుమార్, లింగంపల్లి శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. జనరల్ కేటగిరీలో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, బండి ప్రశాంత్ దీపక్, ఎడబోయిన శ్రీనివాస్, తాడ వీరారెడ్డి, ఎండి. కలీంఖాన్, ఎండీ బబ్లూ, కస్తూరి వరప్రసాద్, గుండ కిషన్, తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, ఎండీ ముజీబ్‌హుస్సేన్, ఎలగందుల మునీందర్, ఇ లక్ష్మణ్‌రాజు, వొడ్నాల రాజు, బొమ్మరాతి సాయికృష్ణ, బాశెట్టి కిషన్, నాగుల సతీష్‌గౌడ్, దేశబోయిన వేదాద్రి, దరణికోట దామోదర్, మూల వెంకట రవీందర్‌రెడ్డి, కైలాస్ నవీన్, అనురాస్‌కుమార్, మంగి రవీందర్, లక్కిరెడ్డి కిరణ్, కూసరి అనిల్, నార్ల శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. ఉయ్యాల ఆనందం రెండ్లు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు.

బ్యాంకును అభివృద్ధి చేస్తాం

మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్

బ్యాంకు డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతోపాటు వాటిని వివిధ రకాల రుణాలను అందించి బ్యాంకును లాభాలబాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాము. మరోసారి అవకాశమిచ్చి ప్యానల్‌లోని అభ్యర్థులందరిని డైరెక్టర్లుగా గెలిపించాలి.

లాభాల బాటలో నడిపిస్తాం

మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

బ్యాంకును లాభాలతో ముందుకు తీసుకెళ్ళడమే ప్రధాన లక్ష్యంగా పోటీ చేస్తున్నాము. మాకు అవకాశమివ్వాలని కోరుతున్నాం. డిపాజిట్ల సేకరణతోపాటు ఆ డబ్బులను రుణాల రూపంలో సభ్యులు, ఖాతాదారులకు అందిస్తూ లాభాలను గడించేందుకు చర్యలు తీసుకుంటాం.

ముమ్మరంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు..



రాజన్న ఆలయ లడ్డూ గోదాంను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

- గంటపాటు రాజన్న దర్శనానికి అంతరాయం
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం రాజన్న దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఉదయం 10గంటల వరకు రాజన్న దర్శనాలకు భక్తులను అనుమతించారు. అంతరాలయంలోని గోపురాల పైకప్పున రేకులను తొలగించే క్రమంలో భక్తులపై పడకుండా ఉండేందుకు గంటపాటు దర్శనాలకు అంతరాయం కలిగింది.

అంతే కాకుండా మరో గంటపాటు స్వామి వారికి నివేదన ఉండటంతో రెండు గంటల సమయంలో గోపురాల పైకప్పు పెద్ద రేకులు, భారీ ఇనుప పైపులను తొలగించారు. రెండు గంటలపాటు దర్శనాలకు అంతరాయం కలగడంతో భక్తులు ఉత్తరం ద్వారం వద్ద రాజన్న దర్శనం కోసం నిరీక్షించారు. రేకులు తొలగించిన తదనంతరం భక్తులకు దర్శనాలను యథావిధిగా కొనసాగించారు.

రాజన్న, భీమన్న ఆలయాల్లో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దీంతో భీమన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. అంతే కాకుండా భక్తులు రాజన్న ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రచార రథం వద్ద సందడిగా కనిపించారు. ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

లడ్డూల గోదాం కూల్చివేత..

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా రాజన్న ఆలయం చుట్టూ ఉన్న భవనాలను ఇప్పటికే కూల్చివేశారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులకు పూర్తి స్థాయిలో పనులను అప్పగించడంతో ఆలయాన్ని ఆనుకుని ఉన్న లడ్డూల గోదాంను బుధవారం కూల్చి వేయడం ప్రారంభించారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ధర్మగుండం నుంచి ఆలయం ముందుకు వెళ్లేందుకు నిలిపివేశారు. భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకుండా వేగంగా అభివృద్ధి విస్తరణ పనులు చేపడుతూనే భక్తులకు దర్శనాలను అనుమతిస్తూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఆలయం ముందు నుంచి భక్తుల దర్శనాలు

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఈవో రమాదేవి..

వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈవో రమాదేవి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాజన్న ఆలయం ముందు తూర్పు ద్వారం నుంచి భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు. దీంతో ఆలయం ముందు స్వతహాగా గంటలపాటు క్యూలైన్‌లో వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈవోతో పాటుగా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రాజేందర్ ఆలయ ఉద్యోగులు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

రాజన్న సేవలో కేంద్ర మంత్రి సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. రాజరాజేశ్వర స్వామి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రమాదేవి అమ్మవారి వస్త్రాలు, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడలు ప్రారంభం





తిమ్మాపూర్‌లో ఎస్‌జీఎఫ్‌ఐ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు, గంభీరావుపేట మండలంలో విజేతలకు బహుమతులు అందజేత

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రాంగణంలో బుధవారం ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 బాలబాలికల ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 22 జట్టు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌ను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని ఓడిన వారు నిరాశ పడకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలని, గెలుపొందిన వారు మరింత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయంతో పాటు క్రీడా ప్రాంగణాన్ని అందించినందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్‌జిఎఫ్‌ఐ జనరల్ సెక్రెటరీ వేణు గోపాల్‌రావు, ఎస్‌జీఎఫ్‌ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్‌రావు, డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్‌లు, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్- 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిజిల్లా నుంచి బాలుర, బాలికలు రెండేసి జట్ల చొప్పున మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతల బహుమతుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా కిసాన్ సెల్ జాయింట్ సెక్రెటరీ దమ్మ శ్రీనివాస్‌రెడ్డి నగదు అందజేశారు. రాజుపేటకు చెందిన మల్లేశం, కొత్తపల్లికి చెందిన షాదుల్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గంగారాం, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారాయణ, పీడీ భాను ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రాయికల్: రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని వేముల తన్వి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 16న సంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల బడ్డీ పోటీల్లో తన్వి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఏఈటీ వి.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దండారి ఉత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని బోర్నపెల్లి చిలుకగూడెంలో దీపావళి పండుగ సందర్భంగా గిరిజనులు దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు దండారి వేడుకల్లో భాగంగా చేసిన గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని గ్రామ దేవత జంగుబాయి దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా, మాజీ ము న్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, లత, రాజు, కవిత, శ్రీనివాస్, సత్యం, ముఖీద్, శ్రీనివాస్‌గౌడ్, గోపి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో నీట్, ఐఐటి బోధించే అధ్యాపకులు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రెగ్యులర్‌గా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ నిరసన తెలుపుతున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

సమస్య పరిష్కరించాలి

కోరుట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పురపాలక సంఘంలో పనిచేస్తున్న మహిళా కార్మికురాలి సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వద్ద మహిళా కార్మికులతో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలోని ఓ పారిశుధ్య కార్మికురాలిని లైంగికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ముక్రం, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎండి ఉస్మాన్, రామిల్ల రాంబాబు, అన్నం రాధ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మల్లాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలసుల పనితీరుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అధికారులు అన్నారు. బుధవారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మల్లాపూర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసుల పనితీరు, రికార్డుల నమోదు, ఫిర్యాదులు, చట్టంపై పోలీసులు అధికారులు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బ్రహ్మణ వాడకు గల శంకర మఠంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు శ్రీ స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు ఎమ్మెల్యే పట్టణంలోని 35 వ వార్డులో 45 లక్షల నిధులతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ స్పందన, నాయకులు అడువాల లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, అనుమల్ల జయశ్రీ, బొలుసాని శ్రీనివాస్, డిఈ వరుణ్, ఏఈ అనిల్, పట్టణ ప్రణాళికాధికారి శ్రీకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏవో

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారిగా నియామకమైన తిరుపతి బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాకర్ సంజయ్ కుమార్‌ను కలి శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల మాసోత్సవంలో భాగంగా గురువారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు పోలీస్‌ల విధులు, రికార్డులు, తదితర అంశాలపై విద్యార్థులకు ఎస్ఐ అనిల్ అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమురం భీం ఆశయ సాధనకు కృషి



కొమురం భీంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో బుధవారం కొమురం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజనుల ఆరాధ్య దైవం, అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోర హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)22 : మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో కొమురం భీమ్ 125వ జయంతి వేడుకలను బుధవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం పోరాడి జల్ జంగిల్ జామిన్ నినాదంతో పోరాటం చేసిన వీరుడు కొమురం భీం అని కొనియాడారు. కొమురం భీం ఆశయాల కోసం పోరాటం చేయాలన్నారు. నాయకపోడ్ వారు రాజకీయ, సామాజి కంగా గుర్తింపు రావాడానికి ప్రతి ఒక్కరు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, భూమనందం, రమేష్, రాకేష్, భూమేష్, నర్సయ్య, రాజనర్సయ్య, నారాయణ, రాజు, శంకర్, ప్రదీప్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా మత్స్య శాఖ నిర్దేశించుకుంది. గత యేడాది చేప పిల్లల పంపిణీలో జాప్యం జరిగింది. అప్పటి అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సకాలంలో చేపట్టాలని మత్స్య శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

● కమిటీ పర్యవేక్షణలో..

కలెక్టర్ సత్యప్రసాద్ దిశా నిర్దేశంతో చేప పిల్లల పంపిణీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. కమిటీ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కం కన్వీనర్‌గా జిల్లా మత్స్య శాఖ అధికారి, సభ్యులుగా పశు సంవర్ధక శాఖ అధికారి, ఈడీఎం, ఇరిగేషన్ ఈఈలు ఉన్నారు.

త్వరగా చేప పిల్లలు పంపిణీ చేయాలి

-మర్రి నర్సయ్య, మత్స్య కార్మికసంఘ నాయకుడు



చేప పిల్లలను జూలై, ఆగస్టులో పంపిణీ చేస్తే బాగా పెరిగేవి. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో పంపిణీ చేయడం వల్ల ఆశించిన స్థాయిలో పెరగవు. అనువైన సమయంలోనే చేప పిల్లలను నీటిలో వదిలితే దిగుబడి కలిసి వస్తుంది. లేదంటే ఆశించిన ఫలితాలు రావు.

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

-సురేశ్, జిల్లా మత్స్య శాఖ అధికారి



జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు సంసిద్ధంగా ఉన్నాం. మత్స్యశాఖ తరఫున అన్ని ఏర్పాట్లు చేపట్టాం. సాధ్యమైనంత త్వరగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. మత్స్యకారుల సంక్షేమం కోసం 1.68 కోట్ల చేప పిల్లలను వదలనున్నాం.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సంతోష్

గొల్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వరంగ సంస్థల వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ రైతులకు సూచించారు. బుధవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో వానాకాలం వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి రైతులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి నిరంతరం పాటు పడుతుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థల కొనుగోలు కేంద్రాలను యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రికి ఈ సందర్భంగా రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుతరంగ సంస్థల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని రైతులు లబ్ధిపొందాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వరంగ సంస్థలకే తమ ధాన్యంను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. పంట ఉత్పత్తులను విక్రయించడానికి మార్కెట్‌కు వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వహకులను ఆదేశించారు. మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన కనీస వసతులను కల్పించాలని వ్యవసాయ మార్కెట్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, నాయకులు లంబ లక్ష్మణ్, కాసారపు అరవింద్, రమేష్, ఏఎంసీ కార్యదర్శి అల్లె వరలక్ష్మీ, గొల్లపల్లి సింగిల్ విండో కార్యదర్శి బెజ్జెంకి రాంసుధాకర్‌రావు, డీవో చెవులమద్ది సురేందర్, డైరెక్టర్లు లక్ష్మణ్ రావు, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కొడిమ్యాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : రైతులు ఇబ్బందుల పాలుకాక ముందె ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతు ఐక్య వేదిక మండల అధ్యక్షుడు ఎలేటి నర్సింహారెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజు రోజుకు మారుతున్న వాతావరణ మార్పులతో రైతులు దిక్కుతోచని పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుక వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా, ప్రతి ధాన్యం గింజను పూర్తి స్థాయిలో తూకం వేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులు కుంగిపోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన కోరారు.

చికిత్స కోసం ఆర్థికసాయం

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన గట్ల రాము బైక్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడటం వల్ల వైద్య చికిత్స కోసం బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్ రావు రూ.5,000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, మాజీ మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, మండల ఉపాధ్యక్షులు ఒగేటి అంజయ్య, నల్లవెల్లి సుజన్‌రెడ్డి, నార్ల విజయ్, గాజుల రామదాసు, కొడిగంటి కిరణ్ పాల్గొన్నారు.

చెస్‌లో విద్యార్థి ప్రతిభ

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలోని శ్రీ వాణి విద్యాలయానికి చెందిన ఇమ్మడి సమర్థ్ అనే విద్యార్థికి అండర్ 17 రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో మూడవ బహుమతి సాధించాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో సమర్థ్ చెస్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి పొందారు. పాఠశాల కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సంగనభట్ల సంతోషి, డైరెక్టర్లు సంగనభట్ల దినేష్, తోట శంకర్, ఉపాధ్యాయులు విద్యార్థి సమర్థ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

'విద్యార్థులు కళల్లో ప్రతిభ కనబర్చాలి'



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు కళల్లో కూడా ప్రతిభ కనబర్చాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. సమగ్ర శిక్ష పాపులేషన్ ఎడ్యుకేషన్‌లో భాగంగా జగిత్యాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు స్థానిక టీచర్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో జడ్పీహెచ్ గుట్రాజ్‌పల్లి మొదటి స్థానంలో నిలువగా, రెండవ స్థానంలో టీజీఎంఎస్ గొల్లపల్లి, మూడో స్థానంలో జడ్పీహెచ్ఎస్ గుట్రాజ్‌పల్లి ఎంపికయ్యాయని తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే జానపద నృత్యపోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో సైతం విద్యార్థులు సత్తాచాటి. జిల్లా ఖ్యాతిని ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ రాజేష్ పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా ఎలిగేటి రాజేంద్రప్రసాద్, అక్కినపల్లి సతీష్, ప్రముఖ జానపద కళాకారులు గడ్డం రమేష్, బోగ అశోక్ లు వ్యవహరించారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ అధికారి

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి సత్యనారాయణ సూచించారు. మండలంలోని సిరికొండ సింగిల్ విండో కార్యాయలంలో ముఖ్య కార్యనిర్వాహణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు పాటిస్తూ కొనుగోళ్ళు సక్రమంగా చేపట్టాలని అన్నారు. కాంటాలు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు, మంచినీటి వసతి, గన్నీ సంచులు, హమాలీలు, విద్యుత్ వసతి, కేంద్రాలను చదును చేసి ఉంచడం, రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు కొనుగోళ్ళ వివరాల నమోదు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిజిస్టర్ మల్లేశం, దత్తత అధికారి వేణుమాధవ్, సీఈఓలు రాంప్రసాద్, అరుణ్, విజయ్, సిబ్బంది ఉన్నారు.

●కోరుట్ల రూరల్: సింగిల్‌విండో పరధిలో నిర్వహించే వరి దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై నిర్వహకులు చర్యలు చెపట్టాలని సహకార సంఘాల జిల్లా ఆడిట్ అధికారి సత్యనారాయణ సూచించారు. బుధవారం పట్టణంలోని సహకార సంఘ భవనంలో మండలోని చిన్నమెట్‌పల్లి, పైడిమడుగు, అయిలాపూర్, కోరుట్ల, ఎఖీన్‌పూర్, మాదాపూర్ గ్రామాల సింగిల్ విండో కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలను అందించారు. మండలంలో వరి దాన్యం సాగు వివరాలను సేకరించి వాటికి దగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి కొనుగోలు చేయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిష్టర్ మలేశం, వేణుమాదవ్, సింగిల్ విండో కార్యదర్శులు బుచ్చయ్య, సంతోష్ మహేందర్, బాబు, జగదీష్, అనిల్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

కొడిమ్యాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం తీసుకు రావాలని మండల వ్యసాయాధికారి పి.జ్యోతి కోరారు. బుధవారం మండలంలోని నల్లగొండ రైతువేదికలో (కెపీఎఎస్)కపాస్ కిసాన్ ఆప్, పత్తి పంట వేసిన రైతుల మోబైల్ నెంబరు మార్పుపై అవగాహన కలిపించారు. వరి కోసిన తర్వాత నిప్పుతో తగులబెట్టడం వలన కలుగు నష్టా గురించి రైతులకు అవగాహన కలిపించారు. పత్తి పంటను సీసీఐ వారికి మార్కెట్‌లో అమ్ముకోవాలనుకునె రైతులు ముందుగానె కపాస్ కిసాన్ యాప్‌లో బుక్ చేసుకోవాలన్నారు. గతంలో మాదిరిగా నేరుగా మార్కెట్‌కు వెల్లరాదన్నారు. స్లాట్ బుక్ చేసుకొన్న తర్వాత అలాట్ అయిన రోజు మాత్రమె మోబైల్ నెంబరుతో మార్కెట్‌కు వెల్లాలన్నారు. మోబైల్ నెంబరు అప్ డేట్ చేసుకోవాలనుకునె రైతులు సంబందిత ఏఈవోలను సంప్రదించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఈవో శ్రీలత, రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని నమిళికొండ గ్రామంలోని రైతులకు ఏఈవో రాజేష్ కపాస్ కిసాన్ ఆప్ గురించి అవగాహన కలిపించారు.

వైకుంఠ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తిమ్మాపూర్ పంచాయతీకి వైకుంఠరథాన్ని ఇస్తున్న జువ్వాడి సూర్యారావు కుటుంబసభ్యులు

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి కోరారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి సూర్యారావు జ్ఞాపకార్థం రూ.3 లక్షలు విలువ గల వైకుంఠరథాన్ని కుటుంబసభ్యులు బుధవారం గ్రామపంచాయతీకి బహుకరించారు. ఈ సందర్భంగా దివంగత జువ్వాడి సూర్యారావు పెద్ద కూతురు హైకోర్టు జడ్జి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి మాట్లాడుతూ మా నాన్న తిమ్మాపూర్ సర్పంచ్‌గా, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులుగా, దేవస్థానం మాజీ చైర్మన్‌గా, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులుగా ప్రజలకు అనేక సేవలు అందించినట్లు తెలిపారు. గ్రామంలో వైకుంఠరథం లేదనే విషయాన్ని తెలుసుకుని గ్రామపంచాయతీకి నాన్న జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులందరం కలిసి వైకుంఠ రథాన్ని బహుకరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జువ్వాడి భారతి, శ్రీలత, శ్రీకుమారి, శిరీష, కుచాడి శ్రీహరిరావు, రేగులపాటి సతీష్‌రావు, విష్ణుప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సరిహద్దు వివాదం పరిష్కారం

భీమారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భీమారం మండంలోని గోవిందారం, కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామాల సరిహద్దుల వివాదం బుధవారంతో ముగిసింది. గోవిందారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 30 ఎకరాల భూమిని అటవీ ప్రాంతానికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గోవిందారం, సూరంపేట గ్రామాల మధ్య సరిహద్దులను నిర్ణయించాలని గ్రామ వీడీసీ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో, డీఎఫ్‌వోలను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో బుధవారం సంబంధిత అధికారులు గోవిందారం గ్రామానికి వచ్చి గోవిందారం-సూరంపేట గ్రామాల సరిహద్దును నిర్ణయించారు. అలాగే అంపుడు పోచమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్ద మనుషులు, గ్రామస్థుల సమక్షంలో స్వాగత బోర్డును ఏర్పాటు చేశారు. గోవిందారం గ్రామ శివారులోని పంది గుట్ట సమీపంలోని సుమారు 30 ఎకరాల భూమిని ఫారెస్ట్‌కు ఇవ్వకుండా, రెవెన్యూ భూమిగానే ఉంచుతామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు గ్రామ నాయకులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

బాక్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపాలి

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని మాజీ కౌన్సిలర్ ఓజ్జల బుచ్చిరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డుకు చెందిన బాక్సింగ్ క్రీడకారుడు బైరి రోహిత్ అండర్ 19 ఉష్ బాక్సింగ్ కేటగిరిలో వచ్చె నెల జరగబోయే నేషనల్ లెవల్ కాంపిటిషన్‌కు సెలక్ట్ కాగా యువకుడిని ఆయన శాలువతో ఘనంగా సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఓజ్జల శ్రీనివాస్, పుప్పాల రాజన్న, వేణుగోపాల్, శివ,చరణ్ తేజ, విశ్వ, అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాధికారంతోనే యాదవులకు గుర్తింపు'



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా యాదవసంఘం అధ్యక్షుడు కొమురయ్య

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారంతోనే యాదవులకు గుర్తింపు వస్తుందని ఉమ్మడి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు సౌగాని కొమురయ్య యాదవ్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలో జిల్లా యాదవ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నా ఆయన మాటాలడుతూ యాదవులు రాజకీయంగా ఎదగాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి చోట యాదవులు పోటీ చేయాలన్నారు. ఈ నెల 24 వతేదీన కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరుగు ఉమ్మడి జిల్లా యాదవ రాజకీయ శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యాదవులు శ్రీకృష్ణుని అంశ అని, మన ఆరాధ్య దైవం మల్లికార్జున స్వామి అని అందువల్ల మల్లికార్జున స్వామి రోజైన ఆదివారం యాదవులు ఎవరు మాంసం, మద్యం ముట్టుకోవద్దని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు గనవేణి మల్లేశ్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బల్కం మల్లేశ్ యాదవ్, కొక్కెర మల్లేశ్ యాదవ్, ఎక్కలదేవి మధు యాదవ్, రాజు, వెంకటేష్, చిర్రం తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త అనుమల్ల మల్లేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, నాయకులు బాపురపు నర్సయ్య, కొయ్యడి మహిపాల్, వాసం దిలీప్, దాసరి గంగాధర్, బత్తిని భూమయ్య పాల్గొన్నారు.

అదనపు తరగతి గది నిర్మాణ పనుల పరిశీలన

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు డిడినగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు కంప్యూటర్ తరగతి గది నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకిర్ సిద్ధికి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గది నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. డిడి నగర్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ అదనపు తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం 14లక్షల రూపాయలను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేణు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి'

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. కోరుట్ల నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగ్గసాగర్, కొండ్రికర్ల గ్రామల మధ్య రహదారికి గతంలోనే మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ముదాం నర్సింహులు, పుల్ల జగన్‌గౌడ్, రాజారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, డాకూరి వెంకటేష్, మెండె రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్‌నాయక్

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని దుంపెట, పోసానిపేట గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేసి ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మండలంలో 205 బేస్‌మెంట్, 75 గోడలు, 25 స్లాబ్ స్థాయిలో ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సులోచన, కారోబార్లు నరేశ్, అబ్దుల్ ఘనీ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం పరామర్శించారు. చింతలూరు మాజీ ఉప సర్పంచ్, బషీర్‌పల్లికి చెందిన కిషన్ నాయక్ భార్య కాంత అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను, ఇటిక్యాలకు చెందిన సోమ రాజరెడ్డి భార్య రాధ గుండెపోటుతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే రాయికల్ మాజీ ఎంపీటీసీ బూర్గుల రాజేందర్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను, రాయికల్‌కు చెందిన అనుమల్ల మల్లేశ్వర్ మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

●సారంగాపూర్, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాలగిరి రఘుపతి రెడ్డి కూతురు రవీన మృతి చెందగా జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మైనార్టీ శాఖ అధికారుల పర్యటన

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో బుధవారం జిల్లా మైనార్టీ శాఖ ప్రత్యేక అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల,షాదిఖానా,రెండు ఖబ్రస్థాన్ ల అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు సూచనల మేరకు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ఎస్ చిత్రు, జూనియర్ అసిస్టెంట్ మురళిలు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఉర్దూ మీడియం పాఠశాల అసంపూర్తి భవన పరిస్థితి, మౌలిక సదుపాయాల లోపాలు, షాదిఖానా, ఖబ్రస్థాన్‌ల నిర్మాణ అవసరాలను పరిశీలించారు. పాత భవనాలు దెబ్బతిన్న కారణంగా కొత్తగా నిర్మిత పాఠశాల నిర్మాణం భవనం, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు తక్షణం అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు అక్షర్ జాని, తమీజ్, రజాక్,నదీం, వకీల్, హుస్సేన్, పార్టీ జనరనల్ సెక్రటరీ తుమ్మనపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరుల పాదయాత్ర

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన తిరుకోవెల సురేందర్, లింగాపూర్‌కు చెందిన యాచమనేని దీపక్‌లు బుధవారం రాయికల్ పట్టణం నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం శబరిమలకు పాదయాత్రను ప్రారంభించారు. 53 రోజుల పాటు సాగే ఈ పాదయాత్ర లోక కళ్యాణార్థం, హిందూ ధర్మ విశిష్టత కోసం రెండవసారి చేయనున్నట్లు పేర్కొన్నారు.